

"రామకృష్ణా, నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి. శని -ఆదివారాల్లో నువ్వు మా ఊరికి రావాలి. నీ కోసం నేను ఎదురు చూస్తుంటాను."

జానకిరామయ్య మాస్టారు కబురుపెట్టారు. అంతే, మరో ఆలోచన లేకుండా మాస్టారింటికి చేరుకున్నాను.

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలు. మాస్టారింట్లో హెడ్మాస్టార్. మాస్టారు దగ్గర చదువుకున్నవాళ్లందరూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. వీళ్లలో నేనూ ఒకడిని. చదువుతో పాటు, సంస్కారం, జీవితం పట్ల అవగాహన, వీటన్నింటినీ మాస్టారు మాకు అలవడేటట్టుగా నేర్పారు. జానకిరామయ్య మాస్టారంటే నాకు ఎంతో అభిమానం.

పూజాకార్యక్రమాలు పూర్తిచేసుకుని మాస్టారు హాల్లోకి వచ్చారు. లేచి నిలుచున్నాను. "కూర్చో, కూర్చో" అంటూ, తనూ కూర్చున్నారు. ఆయన కెదురుగా నేనూ కూర్చున్నాను.

"రామకృష్ణా! నిన్ను కలవాలని, నీతో మాట్లాడిన తరువాత ఒక విషయంలో నిర్ణయం తీసుకోవాలని అనుకున్నాను." తను చెప్పబోయే విషయానికి మొదటిమాట.

"చెప్పండి మాస్టారూ" నాలో అవ్యక్తమైన కుతూహలం.

"కావ్యకూ, నీకూ పెళ్లయిందని తెలిసింది. ఈ మధ్యనే తెలిసింది."

మాస్టారి మాటకి మనస్సు ఉలిక్కిపడింది. "నేను ఎవరికీ తెలియ కుండా పెళ్లి చేసుకోవాల్సివచ్చింది మాస్టారూ. అందుకని..."

"రామకృష్ణా ఎవరికీ తెలియకుండానే పెళ్లి చేసుకుందామని, కావ్య నీతో మాట్లాడటం వల్లనే చివరికి నన్ను కూడా పిలవలేకపోయావని అర్థం చేసుకున్నాను" మాస్టారి మాటల్లో గాంభీర్యం.

తెలియకుండానే నా మనసు భయపడుతోంది."అన్నట్టు రామకృష్ణా, కావ్య, నీకు పెళ్లికి ముందే తెలుసా? నా ఉద్దేశమేమంటే ఆ అమ్మాయికీ, నీకూ పెళ్లికి ముందే స్నేహం ఉందా?"

మాస్టారి ప్రశ్నకి హఠాత్తుగా నేను ఉక్కిరి బిక్కిరయ్యాను. ఎందుకంటే మాస్టారు ఇలా ఎందు కడుగుతున్నారో తెలియదు. ఇలా అడుగుతారని కూడా నేను అనుకోలేదు. కాని మాస్టారు ఇలా అడుగుతున్నారంటే ఏదో అర్థముంది! అదే ఏమిటి?


"మొహమాటపడకు, నీ మనసులో మాట ధైర్యంగా చెప్పు" మాస్టారు మాటల్లో నా జవాబు కోసం ఎదురుచూస్తున్న భావం.

"చెప్పుకోకూడనది, చెప్పకూడని విషయ మేమీ లేదు మాస్టారూ! ఎటొచ్చి కావ్యని నేను పెళ్లి చేసుకోవటం ఎవరికీ తెలియటం ఇష్టం లేక...." నేను తప్పు చెయ్యలేదనే అర్థంతో మాస్టారికి జవాబు చెప్పాను.

నా మాటకి మాస్టారు సూటిగా నన్ను చూశారు. "మీ ఇద్దరి మధ్య పెళ్లికి ముందే స్నేహం కలిసిందా, ఆ స్నేహం మీ పెళ్లికి కారణ మయ్యిందా?" అడిగిన ప్రశ్న మళ్లీ మాటలు మార్చి అడిగారు.

జానకిరామయ్య మాస్టారు ఎందుకిలా అడుగుతున్నారు? ఆయన అంతర్యమేమిటి? మాస్టారి

- కేశిరాజు ఫణిప్రసాద్



వైపే చూస్తున్నాను. ఆయన మాటలకి అర్థం కోసం వెతుకుతోంది నా మనసు.

పరిచయం. కావ్యతో పరిచయం. ఒక అపురూపమైన పరిచయం. నాకు తెలియకుండానే ఆ నాటి సంఘటన... మా ఇద్దరినీ కలిపిన ఘటన.

"భాస్కర్, నేనూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. ఎందుకో తెలియదు కాని అతనికి పెళ్లి సంబంధాలు కుదరటం లేదు. "నేను పెళ్లి చేసుకోవాలి, ఒక ఇంటివాడిని కావాలి" అనుకుంటూ అన్ని విషయాలు మనసు విప్పి నాతో చెప్పుకునేవాడు. . పెళ్లి ప్రయత్నాలలో ఒక భాగంగా, నేనూ, భాస్కర్ ఒక అమ్మాయి ఇచ్చిన సమాచారంతో వర్కింగ్ వుమెన్స్ హాస్టలుకి వెళ్లాం.

కొంచెం సేపటికి తను కావాలనుకున్న అమ్మాయి, లలితను తీసుకొచ్చి, నన్ను పరిచయం చేశాడు. లలిత, తనతో పాటు వచ్చిన తన స్నేహితురాలు కావ్యని నాకు పరిచయం చేసింది.

"అసలు విషయం మాట్లాడుకోవటం జరిగింది. పెళ్లెప్పుడు చేసుకుంటే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. జీవితాలు కలుపుకునేముందు, వాళ్లు ఒకరినొకరు అర్థంచేసుకోవాలి.

"అవగాహనతో మనసులు కలిస్తే వైవాహికజీవితం సుఖ మయమవుతుంది" సందర్భానికి తగిన సలహా కావ్య సూచించింది. మాకందరికీ ఎంతో నచ్చింది.

"అటు తరువాత నుంచి, వీలు చేసుకుని సాయంత్రాలు, సెలవు



రోజుల్లో లలిత కోసం భాస్కర్ వెడుతూండేవాడు. సెలవు రోజుల్లో భాస్కర్‌తో పాటు నేనూ వెళ్లాల్సివచ్చింది.

"ఒక ఆదివారం సాయంత్రం పార్కులో చెట్టు కింద నేనొక్కడినీ కూర్చున్నాను.

"హల్లో రామకృష్ణ గారూ!" అన్న పిలుపు వినిపించింది. కావ్య నవ్వుతూ పలకరించింది.

"రండి రండి" అని పిలిచాను. ఒక్కడినే కూర్చోటంతో నాకూ బోర్‌గా ఉంది. అటువంటి క్షణంలో కావ్య రాక నాకెంతో ఉల్లాసం కలిగించింది.

"మీరివ్వాళ కూడా వస్తారో రారో అనుకుంటున్నాను" కావ్య మాట్లాడింది.

"నా రాక గురించి మీరెందుకలా అనుకుంటున్నారు?" నాలో ఆపుకోకుండా కలిగిన కుతూహలం.

"మా లలితతో పాటు నేను రోజూ ఇక్కడికి వస్తూనే ఉన్నాను. ప్రేమ జంట ఒక చోట, ఒంటరిగా నేను మరో చోట. ఒకర్తినే ఉండటానికి విసుగొస్తోంది." కావ్య అభిప్రాయం.

"వాళ్లిద్దరి కోసం మీరు కూడా రావటమెందుకు, ఇన్ని రోజులు గడిచాయి ఇప్పుడు ఒకరికొకరు పూర్తిగా తెలిసినవాళ్లుగా ఇక వీళ్లకి మన అవసరం లేదు!" అన్న మాట విని, కావ్య ఒకసారి పరిశీలనగా చూసింది నన్ను.

"రామకృష్ణ గారూ! లలితతో నాకు స్నేహంతో పాటు ఆమె జీవితం పట్ల బాధ్యత కూడా ఉంది."

అలా మాట్లాడటంతో నేను ఒక పక్క సంతోషించాను. కాని అదే క్షణంలో మరో అనుమానం. "అంటే భాస్కర్, లలితల పెళ్లి విషయంలో మీరు సందేహిస్తున్నారా?" సూటిగా అడిగాను.

"నాది సందేహం కాదు. జరుగుతున్న సంఘటనల వల్ల, నేను తీసుకొన్న నిర్ణయం. మా ఫ్రెండ్ లలిత పెళ్లికి పెద్దరికం వహించాను. వాళ్ల పెళ్లి జరిగేటంతవరకూ, నా బాధ్యత తప్పనిసరిగా నిర్వహించాలి" కావ్య మాటలు కచ్చితంగా ఉన్నాయి.

"ఒక జీవితం చేదుగా అయ్యుండొచ్చు. అలాగని జీవితమే చేదుగా ఉంటుందని నిర్ణయించుకుంటే ఎలా?" ఆమె వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలనే ఉద్దేశం నాలో.

"గాయపడిన బ్రతుకులు మావి! మా బ్రతుకుల మీద అనుమానపు కారం చల్లినవాళ్లే గాని మమకారం చూపించినవాళ్లెవ్వరూ లేరే! అయినవాళ్లు మమ్మల్ని అనుమానిస్తూ ఉంటే ఎంత కాలం సహిస్తాం? మేము పేదవాళ్లం. ఆప్యాయతంటే తెలియదు. అభిమానించి అక్కున చేర్చుకున్నవాళ్లు మాకెవ్వరూ లేరు. అందుకే మాకున్న చదువులతో ఉద్యోగం చేసుకుంటున్నాం. ఉమెన్స్ హాస్టల్లో తల దాచుకుంటున్నాం. లలితకూ, నాకూ స్నేహం కలిసినప్పటినుంచి ఇద్దరం, ఒకరి బాగోగులు మరొకరం పట్టించుకుంటున్నాం" కావ్య మాటల్లో నేటి సామాజికవైఖరి ఉంది.

"జీవితం ఒక ఆశ, జీవితం ఒక గౌరవం, జీవితం ఒక అవగాహన. ఇదే కావ్య వ్యక్తిత్వం. ఆమె వ్యక్తిత్వానికి గుర్తింపు నిచ్చే మనిషి, తన మనిషి కావాలి. కావ్య ఆంతర్యం అర్థం చేసుకున్న నా హృదయం, ఆమెకు తోడుగా నిలవాలని కోరుకుంది."

నా మాటలు విన్నారు మాస్టారు. నన్నే చూస్తున్నారు. ఆ చూపుల్లో ఎన్నెన్నో భావాలు! "అనాథలను ఆదుకునేవాళ్లుంటే అందరూ అనాథలే!" జానకిరామయ్య మాస్టారి మాటల్లో వ్యంగ్యం వ్యక్తమవుతోంది.

నాకు తెలిసినంతవరకు మాస్టారి స్వభావానికి వ్యంగ్యంగా మాట్లాడటం విరుద్ధం, మరొకరు మాట్లాడినా ఆయనకు నచ్చదు. మరి... ఇప్పుడు తనే ఎందుకలా మాట్లాడుతున్నారు? అయోమయం నాలో! మనసుండబట్టలేక, నన్ను నేను నిగ్రహించుకులేక మాస్టారినే అడిగాను.

"నీ తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా, స్వతంత్రించి కావ్యను పెళ్లి చేసుకున్నావు. నిజానికి కావ్య అనాథ కాదు. ఆమెని పెళ్లి చేసుకుని మీ అమ్మానాన్నలకు దూరమై నువ్వు అనాథవైపోయావు రామకృష్ణా!" మాస్టారి మాటల్లో సానుభూతి.

"నీ తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా, స్వతంత్రించి కావ్యను పెళ్లి చేసుకున్నావు. నిజానికి కావ్య అనాథ కాదు. ఆమెని పెళ్లి చేసుకుని మీ అమ్మానాన్నలకు దూరమై నువ్వు అనాథవైపోయావు రామకృష్ణా!" మాస్టారి మాటల్లో సానుభూతి.

కాని మాస్టారి మాటల్లో 'కావ్య అనాథ కాదు' అన్న విషయం వింటూంటే తట్టుకోలేకపోతున్నాను. క్షణాలు అనాలోచితంగా గడిచి పోతున్నాయి.

అయితే కావ్య ఎవరు? అనాథ కాని కావ్య, తను అనాధనని చెప్పుకుని ఎందుకు నన్ను పెళ్లి చేసుకుంది? ప్రశ్నలు కెరటాల్లా మనసుని ముంచేస్తున్నాయి.

"రామకృష్ణా! ఈ నిజం నీ అంతట నువ్వు తెలుసుకుంటావని అనుకుంటూ, ఇంత కాలం ఉపేక్షించాను. అదే నేను చేసిన తప్పు. ఇదే కేవలం తప్పు కాదు. నీ జీవితాన్ని తప్పు దారి పట్టించింది. ఒక ఆడపిల్ల అబద్ధం చెప్పి పెళ్లి చేసుకుంది. నా వల్ల ఈ నిజం ముందే తెలిసుంటే ఈ పెళ్లి జరిగి ఉండేది కాదు!"

"మాస్టారూ ఇలా జరిగిందని నేను బాధపడటం లేదు. నా విషయంలో కావ్య ఎందుకిలా ప్రవర్తించిందని బాధపడుతున్నాను. నాకు తెలియవలసిన నిజం మీరు చెప్పండి. కావ్య ఎందుకలా ప్రవహించింది?"

"కొంత మంది ప్రవర్తనకు అర్థం ఉండదు రామకృష్ణా! ఈ రోజుల్లో కాలేజీల్లో చేరి చదువుకుంటున్న అమ్మాయిలు, అబ్బాయిలు తాముంటున్న వాతావరణం చూసి మురిసిపోతూ, తమని తామే మరచిపోతున్నారు. కాలేజీకి వెళ్లటం, అక్కడ చదువుకోవటం తమ కర్తవ్యమని అనుకోవటం లేదు."

మాస్టారి మాటలు వింటూంటే నాలో విసుగు. నేను అడిగినదానికీ, ఇప్పుడు మాస్టారు మాటలకీ పొంతన కుదరటం లేదు. సూటిగా అసలు విషయం చెప్పొచ్చుగా?

"రామకృష్ణా! నా మాటలు..." అన్న మాస్టారిని చూస్తూ, నన్ను నేను సర్దుకుంటూ, "వింటున్నాను మాస్టారూ, చెప్పండి" తొందరపాటుని అతిప్రయత్నంతో కప్పిపుచ్చుకున్నాను.

"కాలేజీల్లో చదువు మాత్రమే ఉండాలని, స్టూడెంట్లు చదువుకోవటానికే కాలేజీకి వెళ్లాలని మీ కాలంలో అనుకునేవారు. అలా అనుకోవటం మీ తెలివి తక్కువ! ఈ రోజుల్లో కాలేజీల్లో ఎంతో మంది కలుస్తారు. వాళ్లతో పరిచయాలు, స్నేహం, ఇవన్నీ అవసరం. ఎందుకంటే మనకి ఎన్నో విషయాలు తెలుస్తాయి. కొత్తవాళ్లంతా స్నేహితులవుతారు! స్నేహం వల్ల జీవితం మీద అవగాహన పెరుగు తుంది. ఇక చదువంటారా, ప్రస్తుతం స్టూడెంట్లు ఒకరితో మరొకరు పోటీపడి మరీ చదువుతున్నారు అంటూ ప్రపంచమంతా తమ గుప్పిట్లోనే ఉందనే ప్రవర్తించే విధానం ఈ కాలం వాళ్లలో ఉంది.

"కావ్య కూడా కాలేజీలో చదువుకుంటోంది. శివరామయ్యకి ఒక్కగా నొక్క కూతురు కావ్య. ఎంతో తెలివైనది, చురుకైనది కావటంతో కూతురిని చదువుకోమని ఎంతో ప్రోత్సహించాడు..." మాస్టారు కావ్య గురించి చెపుతున్నారు.

నాలో రెట్టింపు అవుతోంది ఆసక్తి.

"తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పిల్లలు ప్రగతి సాధిస్తారు. ఇది పిల్లల విషయంలో తల్లిదండ్రులకుండే ఆలోచన. ఇంకా

చెప్పాలంటే ఈ ఆలోచనకు పరిమితి లేదు. ఆశలుంటాయి. ఆశయాలుంటాయి. మాటల్లో చెప్పలేనివి ఇంకా ఎన్నెన్నో ఉంటాయి. ఈ కాలం పిల్లలు వీటన్నింటినీ నిజం చెయ్యాలనే ఉద్దేశంతో ప్రవర్తిస్తున్నారా?'' ఆవేశంలో మాట్లాడుతున్న మాస్టారి వాక్ప్రవాహం, ఈ ప్రశ్న దగ్గర నిలిచిపోయింది.

''కావ్య ప్రవర్తన చూశాక శివరామయ్యకి జరుగుతున్నదంతా తన పెంపకాన్ని వెటకారం చేస్తున్నట్టు, పెంచిన వాతావరణాన్ని హేళన చేస్తున్నట్టు అర్థమైంది.

''శివరామయ్య తొందర పడలేదు. కూతురిని మందలించలేదు. ఆదివారాల్లోనూ, సెలవు రోజుల్లోనూ స్నేహితులను ఇంటికి పిలవటం, వాళ్లడిగింది వండి వడ్డించటం, కాకపోతే స్నేహితులంతా కలిసి బయట తిరగటం, వేళాపాళా లేకుండా ఆలస్యంగా ఇంటికి చేరుకోవటం. ఇదీ కావ్య పరిస్థితి.

''కావ్యకు మంచీ, చెడూ తెలుసు. ఏ విషయంలోనూ, పొరపాటు చెయ్యదు. ఇది శివరామయ్య కూతురి విషయంలో ఆలోచన. చదువు సంగతి ఒక్కసారి స్ఫురణకు తెచ్చుకున్నాడు. కావ్య చదువులో తన తోటివారితో ఎప్పుడూ పోటీపడుతూనే ఉండేది.

''స్కూల్లో చదివే రోజుల్లో ఆమె ఆరోగ్యం బాగా వుండేది కాదు. అన్నం తింటూంటే మధ్యలో కడుపు నొప్పి, నిటారుగా నిలబడలేక వంగుని నానా అవస్థలూ పడేది. ఒక పక్క అన్నం తినలేని పరిస్థితి. మరొక పక్క పరీక్షలు. 'ఈ సంవత్సరం ఆరోగ్యం విషయంగా శ్రద్ధ తీసుకోండి. ఆరోగ్యం కుదుటపడ్డాక వచ్చే సంవత్సరం మళ్లీ చదివించండి' అని ఎంతో మంది డాక్టర్లు, ఆమెను పరీక్షించి మరీ చెప్పారు.

''శివరామయ్య కూడా కూతురిని అలాగే చెయ్యమని చెప్పాడు. 'ఎవరెన్ని చెప్పినా సరే, నేను ఈ సంవత్సరం పరీక్ష రాసి తీరతాను' కావ్య పట్టుదల. కావ్యకి చదువుకునేటప్పుడు నీరసం రాకుండా ఏదో ఒకటి తినిపిస్తూ, తాగిస్తూ వాళ్లమ్మ కంటి మీద కునుకు లేకుండా చూసుకుంది.

''ఏమిటి, హఠాత్తుగా ఆలోచనల్లో పడ్డారు. స్నానం చేసిరండి, ఇద్దరం కలిసి భోజనం చేశాక తీరుబడిగా ఆలోచించుకోవచ్చు'' అంటూ నన్ను లేవదీసింది. జరిగిన విషయం కావ్యతో మాట్లాడితేనే వాస్తవం తెలుస్తుంది. నా మనసులో నిర్ణయం మరింత బలపడింది.

''కావ్య పట్టుదలతో పరీక్షలు రాసింది. టెన్త్ క్లాస్ మెరిట్‌లో పాసైంది. గతం తలుచుకున్న శివరామయ్య తేలికగా ఊపిరి పీల్చుకు న్నాడు. అపోహలతో తను తొందరపడి కూతురు మనసు బాధ పెట్టకూడదని నిర్ణయించుకున్నాడు.

''స్వతహాగా తెలివైన పిల్ల కావ్య. మెరిట్‌లో తను కోరుకున్న కోర్సులో సీటు సాధించింది. అంతే! శివరామయ్యకి చెప్పలేనంత సంతోషం. ఆ సంతోషంతో కూతురు ఏదడిగినా సరే వెంటనే సమకూర్చటం తన బాధ్యతగా అనుకున్నాడు...''

''మాస్టారూ, ఒక్క మాట అడుగుతాను, కాదు, అడగాలని ఉంది'' అన్న నా వైపు అడగమని సైగ చేశారు.

''శివరామయ్యగారు, కూతురి విషయంలో ఎటువంటి లోటూ లేకుండా, ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారని మీ మాటల వల్ల అర్థమైంది. మరి కావ్య, తండ్రిని అర్థం చేసుకోలేదా?'' సందేహం వ్యక్తం చేశాను.

''రామకృష్ణా నువ్వు అడిగిన ప్రశ్నలో ఎంతో అర్థముంది. ఇంకా చెప్పాలంటే ఒక తండ్రి ఆత్మక్షోభ కూడా ఉంది. జరిగిన సంగతేమిటంటే, శివరామయ్య కూతురినీ, ఆమె స్వభావంలోని మార్పును అర్థం చేసుకోలేకపోయిన అమాయకుడు'' మాస్టారి కళ్లలో నీళ్లు.

శివరామయ్య ఎంతో మంచివాడు అటువంటి తండ్రిని కూతురు ఎందుకు వ్యతిరేకించింది?

ఇంట్లోకి అడుగుపెట్టాను. ఆప్యాయంగా ఎదురొచ్చింది కావ్య. నా చేతిలో బేగ్ తీసుకుని లోపలకెళ్లింది.

మళ్లీ కాసేపటిలో కాఫీ తీసుకొచ్చి నాకిచ్చి, తను కూడా కాఫీ తాగుతూ గలగలా మాట్లాడుతోంది. కావ్య మాటల్లో ఉత్సాహం, మొహంలో సంతోషం, ఇవన్నీ నా రాక వల్లేనని నా మనసుకు తెలుసు.

''మీరు ఊరెళ్లినప్పటి నుంచి ఒక్కదాన్నయిపోయాను. మీరెప్పుడొస్తారోనన్న ఆలోచన తప్ప మరో ధ్యాస లేకుండా పోయింది. మన పెళ్లయ్యాక మీరు ఊరెళ్లటం ఇదే మొదటి సారి. ఒక్కదాన్ని ఉండలేక, మీ కోసం క్షణాలు లెక్కపెడుతున్నాను.''

ఎంతో స్వచ్ఛంగా ఆత్మీయంగా మాట్లాడుతున్న నా అర్థాంగి కావ్యని చూస్తుంటే నా మనసు పులకిస్తోంది.

ఒక ఆడపిల్ల. కల్మషం లేని స్వభావం, కన్నతండ్రిని వ్యతిరేకించింది. అంటే కాకుండా ఇంట్లోంచి బయటకొచ్చి తన జీవితాన్ని తనే ఏర్పరచుకున్న ఘటికురాలు. ఇలా జరగటానికి ఏదో బలమైన కారణం ఉండి తీరాలి. జానకిరామయ్యగారి మాటలకీ, కావ్య ప్రవర్తనకూ ఎక్కడా పొంతన లేదు. కావ్యనే పరిశీలనగా చూస్తూ అనుకుంటున్నాను.

''ఏమిటి, హఠాత్తుగా ఆలోచనల్లో పడ్డారు. స్నానం చేసిరండి, ఇద్దరం కలిసి భోజనం చేశాక తీరుబడిగా ఆలోచించుకోవచ్చు'' అంటూ నన్ను లేవదీసింది.

జరిగిన విషయం కావ్యతో మాట్లాడితేనే వాస్తవం తెలుస్తుంది. నా మనసులో నిర్ణయం మరింత బలపడింది.

భోజనం పూర్తిచేసి హాల్లో కూర్చొని పేపరు చూస్తున్నాను. కాస్సేపటికి వంటింట్లో పని పూర్తిచేసుకుని కావ్య నా దగ్గరకొచ్చి కూర్చుంది.

''వచ్చినప్పటి నుండి ,అదే పనిగా ఆలోచిస్తున్నారు, ఏమిటో విషయం?''

హఠాత్తుగా కావ్య అడగటంతో, వెంటనే ఎలా చెప్పాలో తోచలేదు.

''చూడండి, ఏదైనా సమస్య తోటివారితో చెపితే, వాళ్లతో చర్చిస్తే ఏదైనా పరిష్కారం దొరుకుతుంది. మీరు ఆలోచిస్తున్న విషయం నాకు చెప్పమని బలవంతం చేయటం నా ఉద్దేశం కాదు.''

కావ్య మాటలు ఒక విధంగా నన్ను తికమకపెడుతున్నాయి. అలాగని మాట్లాడకుండా ఉండలేకపోతున్నాను.

''కావ్యా, శివరామయ్యగారు:...'' అని మాట్లాడబోయాను.

''శివరామయ్య గారు మా నాన్నగారు... ఒకప్పుడు! పరిస్థితుల ప్రభావం, మా ఇద్దరి మధ్య బంధం, అదే రక్తసంబంధం కూడా తెంపేసింది, అంతే. ఇప్పుడు నాకూ ఆయనకూ మధ్య ఉన్నది పరాయితనం. ఇంకా చెప్పాలంటే మేము అపరిచితులం.''

విషయం ఎలా అడగాలా అనుకుంటూ, ఇంతసేపూ నాలో నేను మథనపడ్డాను. కాని కావ్య సూటిగా, కచ్చితంగా ఒక్క మాటలో ఎంతో తేలికగా చెప్పేసింది.

తన మాటల్లో ఎంతో స్థిరత్వం! అంతే కాదు, తను చేసిన దాంట్లో ఎంత మాత్రం తప్పు లేదు అనే అర్థం కూడా ఉంది.

''అసలు ఈ విషయం నీతో మాట్లాడాలనే అనుకుంటున్నాను. మీ ఇద్దరి మధ్య ఉన్న వ్యతిరేకతకు ఒక కారణం ఉంటుంది. కాదు, ఉండి తీరాలి!'' మనసులో మాట చెప్పాను.

ఒకే కుటుంబం! రెండు జీవితాల నేపథ్యం. నేను తెలుసుకోవాలి తప్పదు.

(మిగతా వచ్చే వారం)